ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.19తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టీచర్ల జాబితా సిద్ధం ?

- నేడు జిల్లా కమిటీ ఆమోదానికి డీఎస్సీ ఎంపిక తుది జాబితా

(వివరాలు 6లో...)



> అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. చక్కని పరిశుభ్రత, కమ్మని భోజనం ఉంటుంది. మొత్తంగా ఇంటిని మరిపించేలా పరిస్థితి ఉంటుంది. దీంతో ఇక్కడి విద్యార్థులు ఆనందంగా, ఆరోగ్యంగా విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. అదే జిల్లా కేంద్రంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ సమీపంలో ఉన్న ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్-2. నాలుగేళ్ల కిందట ఈ హాస్టల్‌కు వార్డెన్‌గా అనిత రావడంతో దాని రూపురేఖలు మారాయి. పిల్లలకు అన్ని వసతులు సమకూరుస్తూ, ఆప్యాయంగా పలకరిస్తూ విద్యార్థుల పాలిట ఆమె మమతల తల్లిగా మారారు.

అనితర సాధ్యం..!

ఎస్సీ బాలికల హాస్టల్-2 రూపురేఖలు మార్చిన అనిత

- రూ.12 లక్షల నిధులతో అనేక అభివృద్ధి పనులు
- దాతల సాయంతో నీటిశుద్ధి యంత్రం, సోలార్ సిస్టం ఏర్పాటు
- హాస్టల్ అభివృద్ధి, పిల్లల సంక్షేమానికి వార్డెన్ ప్రత్యేక శ్రద్ధ

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సంక్షేమ హాస్టళ్లలో మార్పు కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం మెయింటెనెన్స్‌కు కూడా నిధులు ఇవ్వకపోవడంతో చిన్న చిన్న మరమ్మతులు సైతం చేయించలేకపోయారు. దీంతో హాస్టళ్లలో అసౌకర్యాలు ఏర్పడి పిల్లలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిహాస్టల్‌కు మెయింటెనెన్స్‌కు నిధులు మంజూరు చేస్తోంది. ఈక్రమంలోనే ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్-2కు రూ.12లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో వార్డెన్ అనిత హాస్టల్‌ను ఎంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. ప్రతిగదిలో సీలింగ్ మరమ్మతు చేయించారు. రంగులు వేయించారు, కిచెన్‌షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పిల్లలు భోజనం చేసేందుకు ప్రత్యేకషెడ్ ఏర్పాటు చేయించారు. ప్రతిగదిలో కిటికీలకు డోర్లు ఏర్పాటు చేయించారు. 25 టేబుళ్లు కొని పిల్లలకు ఏర్పాటు చేయించారు.

● దాతల సాయంతో సోలార్ సిస్టం

సర్కారు నిధులతోపాటు దాతల సాయంతో ఈ ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ అభివృద్ధికి వార్డెన్ అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎమ్మెల్యే హాస్టల్ సందర్శనకు వచ్చినపుడు తాగునీటికి పిల్లలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయనకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన సొంత నిధులతో వాటర్ ప్యూరిఫైర్‌ను ఏర్పాటు చేయించారు. అలాగే కెనరాబ్యాంకు యాజమాన్యం ఈ హాస్టల్‌కు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయించింది. ప్రస్తుతం ఈ హాస్టల్‌కు విద్యుత్ సరఫరా మొత్తం సోలార్ ద్వారానే జరుగుతోంది. విద్యార్థులకు ప్రతి గదికి మంచాలు, బీరువాలు అందజేశారు. పిల్లలకు సరిపడా తాగునీరు అందించాలని మరో ప్యూరిఫైర్‌ను ఏర్పాటు చేయించారు. వార్డెన్ అనిత హాస్టల్ అభివృద్ధికి, పిల్లల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. అందుకే ఆమె శ్రమను గుర్తించి ఈఏడాది ఆగస్టు15న జిల్లా ఉత్తమ వార్డెన్ అవార్డును కలెక్టరు చేతుల మీదుగా అందించి, అభినందించారు.

నా పిల్లల మాదిరే చూసుకుంటా



హాస్టల్ పిల్లలు కదా అని ఎక్కడా చిన్నచూపు చూడను. ఆ పిల్లలందరినీ నా బిడ్డల్లాగే చూసుకుంటా. అందుకే పిల్లలు నన్ను వార్డెన్‌గా కాకుండా అమ్మగా పిలుస్తూ ఆప్యాయంగా ఉంటారు. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సాయంతో హాస్టల్‌లో పిల్లలకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నా. కలెక్టరు, జేసీ, ఎమ్మెల్యే మా హాస్టల్‌ను సందర్శించి అభినందించారు. ఈక్రమంలోనే నాకు ఉత్తమ అవార్డు దక్కింది. ఇది నాకు ఎంతో ఆనందం కలిగిస్తోంది.

- అనిత వార్డెన్, ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్-2

ఎంతో ఆనందంగా ఉంటున్నా..



మాది పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామం. ఈహాస్టల్‌లో ఏడో తరగతి నుంచి ఉండి చదువుకుంటున్నా. తొలుత హాస్టల్‌కు వచ్చినపుడు దిగులుతో రోజూ ఏడ్చేదాన్ని. అయితే ఇక్కడ ఉన్న వసతులు, మంచి భోజనం, టిఫిన్, బాగా పలుకరించే వారి మధ్య ఆ దిగులు, బాధ మాయమైపోయాయి. ఇప్పుడు హాస్టల్‌లో ఉండటమే నాకు ఎక్కువ ఆనందం కలిగిస్తోంది. వార్డెన్ మేడమ్ మమల్ని ఎంతో బాగా చూసుకుంటారు.

- శ్రీజ, తొమ్మిదో తరగతి

అమ్మా అని పిలుస్తాం...



మాది తాడిపత్రి. నేను ఆరో తరగతిలో ఈహాస్టల్‌లో చేరా. అపుడు హాస్టల్ పాడుబడిన దానిమాదిరి కనిపించేది. ఇప్పుడున్న వార్డెన్ మేడమ్ వచ్చిన తర్వాత హాస్టల్‌కు రంగులు వేశారు. తాగునీరు. సోలార్‌తో హీట్‌వాటర్ ఏర్పాటు చేయించారు. గదులలో కొత్త మంచాలు, బీరువాలు ఏర్పాటు చేయించారు. మావార్డెన్ మమ్మల్ని అమ్మలా చూసుకుంటున్నారు. అందుకే మేము అమ్మా అని పిలుచుకుంటాం. - కావ్య, తొమ్మిదోతరగతి

సబ్ కాంట్రాక్టర్ సతాయింపు..!



వేతనాల కోసం ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- పారిశుధ్య కార్మికుల ఆకలి కేకలు
- నాలుగేళ్లుగా అరకొర వేతనాలే
- ఆందోళనకు దిగిన బాధితులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీతాల కోసం పారిశుధ్య కార్మికులు నిరంతం ఎదురు చూడాల్సి వస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని దుర్భర పరిస్థితుల్లో నెలల తరబడి జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలా ఎన్నాళ్లని ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, క్యాన్సర్ యూనిట్, సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల్లో ఏ ఒక్క నెల సకాలంలో జీతాలు పొందిన దాఖలాల్లేవని వాపోతున్నారు. వేతనాలు ఇవ్వకుండా సబ్ కాంట్రాక్టర్ సతాయిస్తున్నాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో రోగులను చూస్తేనే ముక్కులు మూసుకుంటారు. అలాంటిది వారి మలమూత్రాలు శుభ్రంచేసి, పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న తమను పట్టించుకోలేదని మండిపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఆ పనిని దక్కించుకున్న సంస్థ జిల్లాలో సబ్ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పింది. కాంట్రాక్టర్ కింద సుమారు 250 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారికి సకాలంలో జీతాలు చెల్లించకుండా సబ్‌కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు.

ఎవరికి దొరికింది వారు..

పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం నిధులు చెల్లిస్తుంది. నిర్వహణ ఏ స్థాయిలో, ఎలా ఉండాలో నిబంధనలు వివరించి కాంట్రాక్ట్‌కు అప్పగిస్తుంది. ఆ మేరకు నిర్వహణకు అవసరమైన ఉపకరణాలు, ఫినాయిల్, కార్మికులు ఇలా అన్నీ కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థదే బాధ్యత. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. దీనిని కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ఆర్థిక వనరుగా మలుచుకుంటోంది. పారిశుధ్య ఉద్యోగం ఇప్పిస్తామని కొత్త వారితో దండుకుంటున్నారు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు మార్కులు ఉంటాయి. ఆ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. కొంతమంది అధికారులు, సిబ్బంది మార్కుల పేరుతో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరుగుదొడ్లు, వార్డులు, ఓపీలు, కార్యాలయాలు, కారిడార్‌లు, పరిసరాలు ఇలా విభాగాల వారిగా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి పరిశుభ్రత పనులు చేయించాలి. తగిన విధంగా ఫినాయిల్, ఉపకరణాలు అందజేయాలి. అప్పుడే ప్రభుత్వ నిబంధనల మేరకు పారిశుధ్యం మెరుగవుతుంది. వీటిని పర్యవేక్షించాల్సిన వారే చేతివాటానికి పాల్పడటం రోతగా వుందని రోగులు మండిపడుతున్నారు.

నాలుగేళ్లుగా ఒకటే గోడు



నెల, సంవత్సరం కాదు నాలుగేళ్లుగా జీతాల కోసం ఒకటే గోడు అనుభవిస్తున్నాం. అంతకు ముందు ఇలాంటి పరిస్థితులు ఉండేవికాదు. అరకొర జీతాలతో పిల్లలను చదివించుకోలేకపోతున్నాం. వారికి అన్నం పెట్టడానికైనా జీతాలు వస్తేనే కదా..? రేపు, మాపు అంటూ నెలల తరబడి గడిపేస్తున్నారు. అధికారులకు మా సమస్యలను చెబుతున్నాం. ఆందోళన చేసినప్పుడు మాత్రం ఒక నెలజీతం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు.

- ఫామిద, పారిశుధ్య కార్మికురాలు

కుటుంబ పోషణ ఎలా..?



అధికారులు స్పందించి సకాలంలో జీతాలు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలి. నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. పారిశుధ్య కార్మికులు ఒకరోజు పనిచేయకుంటే అధికారులు, రోగులు, వారి బంధువులు ఇలా అందరూ ముక్కులు మూసుకుంటారు. మలమూత్రాలను ఎత్తివేసి, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా కార్మికులందరూ పనిచేస్తున్నాం. మాకే అన్యాయం చేస్తే ఎలా..? - లక్ష్మన్న, పారిశుధ్య కార్మికుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



పారిశుధ్య కార్మికుల సమస్యలు, జీతాల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. నూతనంగా బాధ్యతలు తీసుకున్నా. విభాగాల వారిగా సమీక్షించి సమస్యలను తెలుసుకుంటున్నా. పారిశుధ్య నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. స్టాఫ్, క్లీనింగ్ తదితర ప్రక్రియ మొత్తం కాంట్రాక్టర్ చూసుకోవాలి. నిర్వహణ, జీతాలు సంబంధిత కాంట్రాక్టర్‌దే బాధ్యత. ఆందోళన చేసేంత వరకు వేతనాలు ఇవ్వడంలేదని కార్మికులు చెబుతున్నారు.

- ప్రొఫెసర్ విజయశ్రీ, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

సబ్ కాంట్రాక్టర్‌తోనే సమస్య



పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ఒప్పంద పనిని సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. జీతాలు, నిర్వహణ ఇలా అన్నింటిలోనూ సబ్ కాంట్రాక్ట్ సమస్యగా మారింది. ఎన్నిసార్లు మందలించినా సబ్ కాంట్రాక్టర్‌లో మార్పురావడంలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇక్కడి పరిస్థితులను వివరించాం. సబ్‌కాంట్రాక్ట్‌ను మార్చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

- మల్లికార్జునరెడ్డి, అడ్మినిస్ట్రేటర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఆపదలో అండగా..!

- నేపాల్ నుంచి సురక్షితంగా వచ్చిన దంపతులు
- పరామర్శించిన ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- సీఎం, లోకేశ్‌కు బాధితుల ధన్యవాదాలు


దంపతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విపత్తు సమయంలో బాధితులు ఎక్కడ ఉన్నా ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు ఉంటారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. కళాకారుల కాలనీకి చెందిన మల్లికార్జున, శశికళ దంపతులు నేపాల్ దేశానికి తీర్థయాత్రకు వెళ్లి, అక్కడ జరిగిన అల్లర్లలో చిక్కుకోగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి, వారిని సురక్షితంగా ఇంటికి చేర్చింది. దీంతో ఎమ్మెల్యే దగ్గుపాటి, వెంకటశివుడుయాదవ్, ఇతర టీడీపీ నాయకులు శుక్రవారం ఆ దంపతుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్కడ జరిగిన సంఘటనల గురించి వారితో ఆరా తీశారు. తర్వాత వాళ్లకు పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. దంపతులకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా దంపతులు మల్లికార్జున, శశికళ మాట్లాడుతూ.... అసలు ఇంటికి చేరుతామో లేదోనన్న భయంతో నేపాల్‌లో బతికామన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం, మంత్రి లోకేశ్ చొరవ వల్ల సురక్షితంగా అనంతపురం చేరగలిగామని ధన్యవాదాలు తెలిపారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడ విపత్తులు జరిగినా అక్కడ టీడీపీ సాయం ఉంటుందన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు జగన్ కనీసం కాలు కూడా బయటపెట్టలేదన్నారు. సీఎం చంద్రబాబు ఏడు పదులు దాటిన వయస్సులో కూడా ప్రజల మధ్యనే ఉంటూ బాధితులకు అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్యచౌదరి, రూరల్ సర్పంచ్ ఉదయ్, తెలుగుయువత అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఎంపీటీసీ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

మాయని మచ్చ !

- ముళ్లపొదల్లో పసికందు

కన్నులైనా తెరవని చిన్ని పాప
ఏ ఇంతికి భారమైందో ?
మమకారం 'మాయ'లా
కనుమరుగైపోయింది.
తన భవిష్యత్తుకు
ప్రతిబంధకమనుకుందో ఏమో
పేగు బంధాన్ని కాదనుకుంది.
రక్తమాంసాలతో దేహాన్ని పంచిన ఆ తల్లి
రుధిర చారలైన ఆరకముందే
పసిగుడ్డును ముళ్లకంపల్లోకి విసిరేసింది.
కావాలని చేసిందో.. కాదనలేక చేసిందో
బొడ్డుతాడును కూడా తెంచకుండానే
అమ్మతనాన్ని ఆహుతి చేసింది.
తల్లి స్పర్శ తగలని ఆ చిన్నారి
ఆకలి కేకలకు కొందరు స్పందించి
అక్కున చేర్చుకుని మాతృమూర్తులయ్యారు.


ముళ్ల పొదల్లో పడేసిన శిశువును తీసుకెళుతున్న మహిళ

ఈ సంఘటన కళ్యాణదుర్గంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్యాస్ గోడౌన్ వెనుక అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఒక వస్త్రంలో చుట్టి ముళ్లపొదల్లో పడేసి వెళ్లిపోయారు. ఏడుపులు వినిపించడంతో చుట్టుపక్కల కాలనీవాసులు గమనించి ముళ్లపొదల వద్దకు వెళ్లి చూడగా ఒక వస్త్రంలో శిశువు కనిపించింది. దీంతో కాలనీవాసులు ఆ పసిగుడ్డును ఇంటికి తీసుకెళ్లి ఒంటిపై ఉన్న రక్తపు మరకలు తుడిచి, స్నానం చేయించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు ఆ శిశువును కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వర్షంలో పూర్తిగా తడవడంతో శిశువు అపస్మారకస్థితిలో ఉందని, వారం రోజుల పాటు వైద్య చికిత్సలు అందించాల్సి ఉందని ఆర్డీటీ వైద్యులు తెలిపారు.


ఇంట్లో శిశువును శుభ్రం చేస్తున్న కాలనీ మహిళలు

15న స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

తొలి విడతలో 6,57,828 కార్డులు

సచివాలయాల పరిధిలో ఇళ్ల వద్దనే అందజేత

జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్మార్ట్ రైస్(రేషన్) కార్డులను ఈనెల 15వతేదీ పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేస్తోందన్నారు. ఏటీఎం కార్డు పరిమాణంలో కార్డు ముందు వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద చిత్రం, చౌక ధరల దుకాణం సంఖ్య, క్యూఆర్ కోడ్ వంటి సెక్యూరిటీ ఫీచర్స్‌తో రూపొందించారని పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే.. కుటుంబానికి సంబంధించి తీసుకునే సరుకుల వివరాలు తెలుస్తాయని అన్నారు. జిల్లాలో 6,57,828 రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ చేస్తామని వెల్లడించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్డుదారులు తమకు కేటాయించిన సచివాలయ పరిధిలోనే స్మార్ట్ రైస్ కార్డు పొందాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది జూన్ 30వరకు అర్హులైన లబ్ధిదారులకు మొదటి దశలో స్మార్ట్ రైస్ కార్డులు జారీ చేశారన్నారు. జూలై 1 నుంచి సెప్టెంబరు 30వతేదీ మధ్య అర్హత కలిగిన కార్డులను రెండో దశలో జారీ చేస్తారన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో 57,439, గుంతకల్లులో 88,486, కళ్యాణదుర్గం-87,905, రాప్తాడు-66,625, రాయదుర్గం-97,707, శింగనమల 91,750, తాడిపత్రి- 86,703, ఉరవకొండ పరిధిలో 81,213 కార్డులను పంపిణీ చేయనున్నారు. తహసీల్దార్లు సంబంధిత మండలాల్లో వాటి పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధుల సమక్షంలో, పండుగ వాతావరణంలో కొత్త స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

యూరియా కోసం..!

- లారీలను నిలిపేసిన ఉప్పరహాళ్ రైతులు
- తమకు ఒక బస్తా కూడా ఇవ్వలేదని ఆగ్రహం


ఉప్పరహాళ్‌లో నిలబడిన యూరియా లారీలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీధరఘట్ట సొసైటీకి వస్తున్న యూరియా లారీలను ఉప్పరహాళ్ గ్రామ రైతులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. తమ గ్రామ రైతులకు ఒక బస్తా యూరియా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీకి ఒక లారీ, శింగానహళ్లి గ్రామంలో ఒక ప్రైవేటు డీలరుకు మరో లారీ యూరియా వెళుతుండటంతో వాటిని నిలిపేశారు. యూరియాను తమ ఊరిలోనే శనివారం ఉదయం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సొసైటీ సిబ్బంది బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. 'మా ఊరికి ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు. మేము పంటలను సాగు చేయడం లేదా..? ఆర్ఎస్‌కేల వద్దకు వెళ్లితే శ్రీధరఘట్ట రైతులకు మాత్రమే ఇచ్చారు..' అని ఎస్ఐ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను వదిలేది లేదని, తమ ఊరిలోనే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వ్యవసాయ, రెవెన్యూ, సొసైటీ అధికారులతో ఎస్ఐ మాట్లాడారు. ఉప్పరహాళ్ రైతులకు ఒక లారీ యూరియా పంపిణీ చేస్తామని హామీ ఇవ్వాలని సూచించారు. అధికారులు సానుకూలంగా స్పందించడంతో రైతులు శాంతించారు. ఎస్ఐ జోక్యంతో లారీలను వదిలిపెట్టారు.

పాపం.. పసివాడు..!

ప్రాణం తీసిన వాటర్ బాటిల్ క్యాప్

6 లో

ఏడాదిన్నర పసివాడు.. ఆడుకుంటూ వాటర్ బాటిల్ క్యాప్ మింగేశాడు. ఊపిరి ఆడక ప్రాణాలను విడిచాడు. ఈ విషాద సంఘటన గుత్తి పట్టణ సమీపంలోని ఎన్‌పీటీసీ ట్రాన్స్‌కో విభాగంలో చోటు చేసుకుంది. నైట్ షిఫ్ట్ ఉండటంతో పసివాడిని వెంట తీసుకువెళ్లిన తల్లి.. అంతులేని విషాదాన్ని మూటగట్టుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

హ్యాకథాన్ పోటీల్లో సత్తా

(వివరాలు 7లో..)

వైసీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి

7 లో

రిజర్వాయర్ పేరిట రైతుల భూములు

- పరిహారం ఇవ్వకనే రికార్డుల నుంచి రైతుల పేర్లు తొలగింపు
- పట్టించుకోని అధికారులు

6 లో

ఆరోగ్యవంతమైన కుటుంబమే లక్ష్యం



జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన కుటుంబ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్ఓ తన కార్యాలయం నుంచి డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు సమగ్ర, ఆరోగ్య ప్రచార, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూల వైద్యసేవలు, పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబ నినాదం తీసుకు వచ్చారని తెలిపారు. జిల్లాలోని 45 ప్రాథమిక, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 433 ఆరోగ్య ఉపకేంద్రాలు, మూడు ఏరియా ఆసుపత్రులు, ఏడు సామాజిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిధిలోని డాక్టర్లు, సిబ్బంది భాగస్వామ్యం కావాలని తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్, డీఆర్డీఏ, ఐసీడీఎస్ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న జిల్లా కార్యదర్శి రమ

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయానికి అభివృద్ధి కమిటీని నియమించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ వర్గాల సభ్యులతో కార్యదర్శి రమ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కమిటీ నిబంధనలు, కార్యక్రమాలు గురించి చర్చించారు. కన్వీనర్‌గా డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, కమిటీ సభ్యులుగా రవికాంత్ క్యాటరింగ్ రమణ, కేఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బృందా, విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీరాములు, రామరత్నం, రచయిత రామలింగయ్య, విశ్రాంత డీఎస్పీ హరి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్‌ను నియమించారు. నూతన కమిటీని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ అభినందించారు.

రిజర్వాయర్ పేరిట భూములు

పరిహారం ఇవ్వకనే రికార్డుల నుంచి రైతుల పేర్ల తొలగింపు

- తోపుదుర్తి అన్నదాతల గోడు పట్టని అధికారులు
- పరిహారం, రుణాల రెన్యువల్‌కు ఇబ్బందులు

రుణాల రెన్యువల్‌కు వన్‌బీ తప్పనిసరి



బ్యాంకులో రుణం తీసుకున్నా. లోన్ రెన్యువల్ చేయాలంటే బ్యాంకు అధికారులు వన్‌బీ, అడంగల్ అడుగుతున్నారు. దీంతో మూడేళ్లుగా బ్యాంకుకు వెళ్లలేకపోతున్నా. రికార్డుల్లో మా పేర్లు రావడం లేదు. దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మాగోడు పట్టించుకునేవారే లేరు. రైతులు పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. అధికారులు చర్యలు తీసుకొని రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయాలి.

- లింగమయ్య, రైతు, తోపుదుర్తి



రిజర్వాయర్ నిర్మాణం చేయడానికి ప్రతిపాదించిన చిన్న చెరువు

ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ పేరుతో తమను నిండా ముంచారని మండలంలోని తోపుదుర్తి గ్రామ రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తోపుదుర్తి రిజర్వాయర్ పేరుతో 714 ఎకరాలను రిజర్వాయర్ ముంపు ప్రాంతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పరిహారం ఇవ్వకుండానే రికార్డుల నుంచి రైతుల పేర్లు తొలగించారు. దీంతో బ్యాంకుల్లో రుణాల రెన్యువల్ కాక రుణభారం పెరిగిపోతోందని రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారేలేరు. గత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత గ్రామంలోనే తమకు అన్యాయం చేశారని రైతులు వాపోతున్నారు. 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రి పరిటాల సునీత పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటితో నింపాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రూ.803 కోట్లతో కాలువ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించి 70 శాతం పైగా పనులు చేయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఎన్నికయిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేరూరు కాలువ ద్వారా కొత్త డ్యాంల పేరుతో ముట్టాల, తోపుదుర్తి రిజర్వాయర్లు తెరపైకి తెచ్చారు. కనీసం తట్టెడు మట్టి తీయకుండా దగా చేసి వెళ్లారని రైతులు వాపోతున్నారు. తోపుదుర్తిలో చిన్న చెరువు 57 ఎకరాలు, పెద్ద చెరువు 148 ఎకరాలు భూమి ఉంది. ఆ భూమితో పాటు మరో 714 ఎకరాలు సేకరించి రిజర్వాయర్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు సేకరించి రెవెన్యూ అధికారులతో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి వదిలేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం పరిహారం కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. రిజర్వాయర్ పరిస్థితి దేవుడికెరుక కనీసం ఆన్‌లైన్‌లో తమపేర్లు కొనసాగించి అడంగల్, వన్ బీ అయినా ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నా వాటికి విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు చెరువులు కలుపుతూ రిజర్వాయర్ పరిధిలో భూములు కలిగిన రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని భూములను యథాతథగా రికార్డుల్లో కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.



రిజర్వాయర్ కోసం సేకరించిన భూమిని చూపుతున్న రైతులు

పరిహారం రాలేదు



రిజర్వాయర్ వస్తుందని రెవెన్యూ అధికారులు మా నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకున్నారు. రిజర్వాయర్ రాలేదు, పరిహారమూ మంజూరు కాలేదు. రికార్డుల్లో మా పేర్లు కూడా లేవు. కనీసం భూములు ఉన్నాయని చెప్పుకోవడానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయింది. ఎక్కడా మాపేర్లు లేవు. నాకు 4.80 ఎకరాల భూమి ఉంది. దానికి పరిహారం రాలేదు, రికార్డుల్లో లేకుండా పోయింది. మేమెవరిని అడగాలి.

- శ్రీరాములు, రైతు, తోపుదుర్తి

కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి



తోపుదుర్తి రిజర్వాయర్ గ్రామ రైతులను ఊరించింది. చాలామంది రైతులు భూములు రిజర్వాయర్‌కు ఇచ్చారు. ఇంతవరకు రిజర్వాయర్ నిర్మాణం జరగలేదు. రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో రావడంలేదు. ప్రభుత్వం నుంచి సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు రావడం లేదు. బ్యాంకులో రుణాల రెన్యువల్ కావడం లేదు. మా బాధలు తీర్చేవారే లేరు. కూటమి ప్రభుత్వం, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ చూపి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

- రాజేష్, రైతు, తోపుదుర్తి

టీచర్ల జాబితా సిద్ధం ?

- నేడు జిల్లా కమిటీ ఆమోదానికి డీఎస్సీ ఎంపిక తుది జాబితా



ఇన్‌చార్జ్ డీఈఓ మల్లారెడ్డిని కలిసిన అభ్యర్థి రమ్యశిల్ప

అనంతపురం విద్య, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సెలెక్ట్ జాబితా సిద్ధమైంది. దాదాపు పక్షం రోజులుగా రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో కమిషన్ కార్యాలయంలోనే ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తూ వచ్చారు. అక్కడ నుంచే సెలెక్ట్‌కు అవకాశం ఉన్న అభ్యర్థులను గుర్తించి కాల్ లెటర్లు పంపారు. ఆ కాల్‌లెటర్లు అందుకున్న అభ్యర్థులకు ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో చేపట్టారు. ఆ సర్టిఫికెట్లలో బోగస్ ఉండకూడదని ఐదారుసార్లు ప్రత్యేక కమిటీలతో పరిశీలింపజేశారు. ఉమ్మడి జిల్లాలో అన్నికేడర్‌లకు సంబంధించి 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, డీఎస్సీ నిర్వహించారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 776మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సమాచారం. మిగిలిన 31 పోస్టులకు ఆయా కేటగిరీల్లో అభ్యర్థులు లేరని తెలిసింది.

- **అనంతకు జాబితా**

మిగిలి పోస్టులకు మినహా ఇతర పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తి కావడంతో జాబితాను సిద్ధం చేసి జిల్లా కమిటీ ఆమోదం కోసం డీఈఓ ప్రసాద్‌బాబుకు అప్పగించినట్లు సమాచారం, ఆయన ఐదురోజులుగా రాజధానిలోనే ఉన్నారు. ఆయన శనివారం జిల్లాకు వచ్చిన తర్వాత రాష్ట్రశాఖ ఎంపిక చేసిన డీఎస్సీ అభ్యర్థుల జాబితాకు జిల్లా కమిటీ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఆప్రక్రియ కూడా శనివారం పూర్తి కావాలని కమిషనర్ ఆదేశించడంతో ముందుగానే కలెక్టరు, జడ్పీ సీఈఓ, మున్సిపల్ ఆర్డీ, వెల్ఫేర్‌శాఖల అధికారులు, గురుకులాల డీసీఓలకు సమాచారం పంపారట. వీరందరూ అందుబాటులో ఉండి డీఎస్సీ జాబితాను రోస్టర్, మెరిట్ ఆధారంగా మరోసారి పరిశీలించుకొని జాబితాకు జిల్లా సెలెక్షన్ కమిటీ ఆమోదం వేసి పంపాలని సూచనలు వచ్చాయి. ఆమేరకు జిల్లా విదాశాఖ యంత్రాంగం కబురు పంపింది. కాగా నేడు రెండోశనివారం అయినా విద్యాశాఖ అన్నిసెక్షన్ల అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఆర్జేడీ, డీఈఓలు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శనివారం రాత్రి కల్లా డీఎస్సీ-2025 సెలెక్ట్ అభ్యర్థుల ఫైనల్ లిస్టు ఓకే కానుంది. ఆతర్వాత జాబితాను రాష్ట్ర అధికారులు ప్రకటించనున్నారు.

- **వెరిఫికేషన్‌కు వచ్చిన రమ్యశిల్ప**

డీఎస్సీ సెలెక్ట్ జాబితా తయారీలో చివరగా ముగ్గురు అభ్యర్థులకు కాల్‌లెటర్లను రాష్ట్ర శాఖ గురువారం పంపింది. వీరి సర్టిఫికెట్లను సాయంత్రంలోగా వెరిఫికేషన్ చేసి నివేదిక పంపాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో విద్యాశాఖ యంత్రాంగం వారికి ఫోన్‌లు చేసి మీకు కాల్‌లెటర్లు వచ్చాయి, మీ ఒరిజన్ సర్టిఫికెట్లు తీసుకొని డీఈఓ ఆఫీస్‌కు రావాలని సూచించారు. ఇద్దరు అందుబాటులోకి రాగా రమ్యశిల్ప అనే అభ్యర్థి కోయంబత్తూరులో ఉన్నట్లు చెప్పారు. ఒకవేళ హాజరుకాకపోతే తన పోస్టుకు ఇబ్బంది వస్తుందేమానని వీడియో కాల్ ద్వారా కోయంబత్తూరు నుంచి మాట్లాడడంతో పాటు ఆవీడియోను డీఈఓకు పంపారు. అధికారులు అవకాశం ఇవ్వడంతో శనివారం రమ్యశిల్ప కోయంబత్తూరు నుంచి డీఈఓ ఆఫీస్‌కు చేరుకొని ఇన్‌చార్జ్ డీఈఓ మల్లారెడ్డి, ఐటీసెల్ ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్‌లను కలిశారు. అనంతరం కమిటీ సభ్యులను పిలిపించి ఆమె సర్టిఫికెట్లను వెరిపికేషన్ చేయించి అప్‌లోడ్ చేసి రాష్ట్రశాఖకు పంపారు.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 125టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

డీఎఫ్ఓ చక్రపాణికి ఉద్యోగోన్నతి



డీఎఫ్ఓ చక్రపాణి

బుక్కపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా అటవీ శాఖాధికారిగా పని చేస్తున్న చక్రపాణికి ఉద్యోగోన్నతి లభించింది. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా ఉన్న ఆయనకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(డీసీఎఫ్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చక్రపాణి జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్ఓగా ఏడాది నుంచి కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లాకు సామాజిక వన విభాగం అటవీ శాఖాధికారిగా గురు ప్రభాకర్‌ను నియమించారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుగా పని చేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పించి అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

రెండు జిల్లాలకు డీఎఫ్ఓల నియామకం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి జిల్లాలకు జిల్లా అటవీశాఖాధికారులను ప్రభుత్వం నియమించింది. అనంతపురం డీఎఫ్ఓగా గురుప్రభాకర్, సత్యసాయి డీఎఫ్ఓగా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వుల వెలువడ్డాయి. ఇటీవల అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(ఏసీఎఫ్) స్థాయి అధికారులకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్)గా ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగోన్నతులు కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మందికి ఏసీఎఫ్‌లకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులుగా ఉద్యోగోన్నతి ఇచ్చింది. కొత్తగా ఉద్యోగోన్నతి పొందిన డీసీఎఫ్‌లను పలు జిల్లాలో ఖాళీగా ఉన్న జిల్లా ఫారెస్ట్(డీఎఫ్ఓ) అధికారులుగా నియమించింది. ఈ క్రమంలో అనంతపురంలో డీఎఫ్ఓ పోస్టు ఖాళీగా ఉండటంతో గురుప్రభాకర్‌ను, సత్యసాయి జిల్లా డీఎఫ్ఓగా శ్రీనివాసులును నియమించింది.



మరువ పారుతున్న గుత్తి చెరువు

నిండిన గుత్తి చెరువు

- పారుతున్న మరువ

గుత్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుసిన భారీ వర్షాలకు గుత్తి చెరువు నిండి మరువ పారుతోంది. భారీ వర్షాలకు మండలంలోని పలు వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న నంద్యాల జిల్లా ప్యాపిలి, కర్నూలు జిల్లా జొన్నగిరి, ఎర్రగుడి తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున వంకల ద్వారా చెరువుకు చేరుతోంది. దీంతో గుత్తి చెరువు నిండి కళకళలాడుతోంది. చెరువు మరువ పారుతుండటంతో మత్స్యకారులు గంగమ్మ పూజ నిర్వహించారు. చెరువు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు యువకులు ఉత్సాహంగా చేపలు పడుతున్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర మహాసభలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గణేనాయక్ భవన్‌లో యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయని మండిపడ్డారు. పథకాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు బడ్జెట్ పెంచాలన్నారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలకు యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని మెస్సా ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళల్లో రాణించాలి

బుక్కపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మక కళల్లో రాణించాలని బీసీ సంక్షేమశాఖ అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు రోజులుగా కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 396 మంది విద్యార్థులు ఆరు విభాగాల్లో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మక కళలను పెంపొందించుకోవడానికి కళా ఉత్సవ పోటీలు చక్కటి అవకాశం అన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఆరు విభాగాల్లో.. గాత్ర సంగీతంలో ఎం. దీపిక (అనంతపురం), హర్షిణి (ధర్మవరం), వాద్య సంగీతం నుంచి వేదవ్యాస్ (రొద్దం), హర్షిత (హిందూపురం) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నృత్యంలో మైథిలీ (దాడితోట), నాటకంలో గజాల గ్రూపు (ఆత్మకూరు) దృశ్య కళలు కారుణ్య (బుక్కపట్నం), కిరణ్మయి (లేపాక్షి), వరుణ్‌సందేశ్ (గోరంట్ల) రాణించారు. అదే విధంగా సంప్రదాయ కథనంలో షణ్ముక (రేకులకుంట) జిల్లా స్థాయిలో అత్యుతమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డైట్ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆరోగ్యాన్ని అందించే డాక్టర్లు వ్యాయామ టీచర్లు

- ఉత్తమ పీడీల సన్మానసభలో కాలవ



ఉత్తమ అవార్డులు పొందిన వ్యాయామ టీచర్లతో కాలవ శ్రీనివాసులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి విజ్ఞానాన్ని పెంచితే.. వ్యాయామ టీచర్లు ఆటలు ఆడించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడే డాక్టర్లని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన పీఈటీలు, పీడీలకు ఏపీపీఈటీ, ఎస్ఏపీఈల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ భవన్‌లో సన్మానించారు. కార్యక్రమానికి కాలవ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ పీడీలు, పీఈటీలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం చాలా ముఖ్యం అన్నారు. ఆటల వల్ల పిల్లలలో మానసిక ఉల్లాసం ఏర్పడి ఆరోగ్యంగా బాగుంటారని అన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రామక్రిష్ణ, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరామిరెడ్డి, పీఈటీల సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, వ్యాయామ టీచర్లు నాగరాజు, సత్యనారాయణ, సుగుణమ్మ, శకుంతల, పార్వతి, నాగమణి, లింగమయ్య, సిరాజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపేసి.. వంకలో పూడ్చేశాడు..!

- రెండు నెలల తరువాత వెలుగులోకి ఘటన
- వివాహేతర సంబంధమే కారణం
- పోలీసుల అదుపులో భర్త, స్నేహితుడు



కాలనీలో ప్రజలను విచారిస్తున్న పోలీసులు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను ఓ వ్యక్తి గొంతు నులిమి చంపేశాడు. స్నేహితుడి సాయంతో ఆమె మృతదేహాన్ని వంకలో పూడ్చిపెట్టాడు. రెండు నెలలుగా ఆమె కనిపించకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యహారంలో హత్యకు గురైన మహిళ భర్త వెంకటరాముడు, అతని స్నేహితుడు విజయ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దంపతులు ఆటోలో చిప్స్ అమ్ముకుంటూ జీవించేవారు. వ్యాపారంలో సాయం కోసం ఓ యువకుడిని వీరు తమ ఇంట్లో పెట్టుకున్నారు. ఆ యువకుడు వెంకటరాముడు భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం బయటపడుతుందని భావించిన ఆమె, ఇబ్బంది తలెత్తకుండా తన కూతురును ఆ యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆ తరువాత కూడా వివాహేతర సంబంధం కొనసాగింది. విషయం తెలుసుకున్న వెంకటరాముడు, భార్య, అల్లుడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అదే కాలనీలో ఉంటున్న మరో మహిళతో వెంకటరాముడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అత్త, అల్లుడు.. ఆ మహిళ కుమారుడిని అపహరించారు. వెంకటరాముడే కిడ్నాప్ చేసినట్లు బాలుడి తల్లిచేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ కేసులో వెంకటరాముడు అరెస్టయ్యాడు. బెయిలు మీద రెండు నెలల క్రితం బయటకు వచ్చాడు. కోపంతో తమను ఏమైనా చేస్తాడని భావించిన అల్లుడు, తన భార్యను తీసుకుని అనంతపురానికి మకాం మార్చాడు. అల్లుడిని చంపితే తన కూతురు జీవితం అంధకారమవుతుందని భావించిన వెంకటరాముడు, భార్యను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు నెలల క్రితం ఓ రాత్రి ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం తన స్నేహితుడు విజయ్‌కి ఫోన్ చేసి ఇంటికి పిలిపించుకున్నాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. మృతదేహాన్ని బైకుపై తీసుకువెళ్లి గొల్లపల్లి సమీపంలోని వంకలో పూడ్చేశారు. ఆ తరువాత వెంకటరాముడు ఏమీ జరగనట్లు తన పని తాను చేసుకుంటున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. గొల్లపల్లి వంకలో మృతదేహాన్ని పూడ్చిన స్థలాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన గురించి పోలీసులు ఇందిరమ్మ కాలనీకి వెళ్లి విచారించారు.

బొలెరో.. లారీ ఢీ

దొరిగిల్లు వాసి మృతి


ఓం ప్రతాప్(ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లిపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముదిగుబ్బ మండలం దొరిగిల్లుకు చెందిన ఓంప్రతాప్ (35) మృతి చెందాడు. మరో వ్యక్తి ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు ముదిగుబ్బ మండలంలోని దొరిగిల్లుకు చెందిన రైతు ఓంప్రతాప్ వ్యవసాయం చేస్తూనే ఓ బొలెరో వాహనం కొనుగోలు చేశాడు. తాను పండించిన టమోటా పంటను కర్ణాటక రాష్ట్రంలోని చింతామణి సమీపంలో ఉన్న వడ్డిపల్లి మార్కెట్‌కు తరలించేవాడు. అలాగే గ్రామంలో ఇతర రైతుల టమోటాలు కూడా తరలించేవాడు. ఈక్రమంలోనే గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ పండించిన టమోటాలను లోడ్ చేసుకుని గురువారం రాత్రి వడ్డిపల్లికి తీసుకెళ్లారు. అక్కడ టమోటాలను అన్‌లోడ్ చేసి, తిరిగి దొరిగిల్లుకు వస్తుండగా తాడిపత్రి నుంచి బెంగళూరుకు సిమెంటును తరలిస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఓంప్రతాప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను వందేమాతరం అంబులెన్స్‌లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, రోడ్డుపై అడ్డంగా పడిన వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్టేషన్‌హౌస్ అధికారి నాగసుబ్బయ్య తెలిపారు. మృతుడికి భార్య ఉన్నారు. పిల్లలు లేరు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

మండ్లిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో మరో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. మండ్లిపల్లికి చెందిన 30మంది మహిళా కూలీలు శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో కూలి పనుల కోసం అన్నమయ్య జిల్లాకు బయల్దేరారు. ప్రమాదానికి గురైన లారీ ముందు భాగంలోనే వీరి ఆటో వెళుతోంది. అయితే ఇంతలోనే ఎదురుగా వస్తున్న బొలెరోను లారీ ఢీకొట్టింది. ఏమాత్రం ఏమరుపాటు జరిగినా ఆటోలోని కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని చెబుతున్నారు.

కుక్క అడ్డురావడంతో..

పరిగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గ్రామానికి చెందిన నాగభూషణం(62) అనే వ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నాగభూషణం మడకశిర మండలం చందకచర్ల గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకుని, బైక్‌పై స్వగ్రామమైన కొడిగెనహళ్లికి వస్తున్నాడు. పరిగి వద్ద ఉన్న ఇండియన్ గార్మెంట్స్ సమీపంలో ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నాగభూషణంను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

బెళుగుప్ప, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామ శివార్లలో శుక్రవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం డిపో నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు నక్కలపల్లి, బెళుగుప్ప గ్రామాల మధ్య పొలంలో బోల్తా పడింది. దీంతో బస్సులోని 20 మంది ప్రయాణికులు ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. కాగా డ్రైవర్ అప్రమత్తమై ముందున్న బస్సు అద్దాన్ని పగులగొట్టి ప్రయాణికులను రక్షించారు. స్టీరింగ్ పనిచేయదని చెప్పినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదంటూ గ్రామస్థులతో డ్రైవర్ అంజి, కండక్టర్ రమేష్ వాపోయారు. వీరిద్దరితోపాటు ప్రయాణికురాలు సుంకమ్మ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు బోల్తా విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎస్ఐ శివ, ఆర్ఐ నగేష్, వీఆర్వోలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

స్పందించిన రవాణాశాఖ మంత్రి..

ఆర్టీసీ బస్సు బోల్తా పడటంపై రవాణాశాఖమంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు స్పందించారు. ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని ఆదేశించారు.

వేధింపులపై కేసు

ధర్మవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తనను భర్త నరేశ్, అత్త వెంకటలక్ష్మి వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తన, నరేశ్‌లకు నాలుగు సంవత్సరాల క్రితం వివాహమయింది. వీరికి 14నెలల కుమార్తె ఉంది. వివాహమయినప్పటి నుంచి భర్త నరేశ్ వేధించడంతోపాటు కొట్టి గాయపరిచారు. దీంతో ఆమె పుట్టినిల్లు అనంతపురం వెళ్లిపోయింది. శుక్రవారం సాయికీర్తన భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వెనుక వైపు శుక్రవారం రైలు కింద పడి శివ (23) అనే యువకుడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గార్లదిన్నెకు చెందిన రామాంజి కుమారుడు శివ గ్రామంలో కూలీ పనులు చేసుకునేవాడు. మూడు సంవత్సరాలు క్రితం మిద్దెపై నుంచి కిందకు పడడంతో కాలు, చెయ్యి విరిగాయి. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతి నుంచి గుంతకల్లు వైపు వెళుతున్న రైలుకింద పడి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

గోరంట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె కుటుంబసభ్యులు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడికి గురువారం రాత్రి దేహశుద్ధి చేశారు. గోరంట్లలో పని చేస్తున్న మహిళకు టీడీపీ నాయకుడు ఫోన్ చేసి కొన్నిరోజులుగా వేధించేవాడు. అందరి ఫోన్ నెంబర్లు తనకు తెలుసని, తాను చెప్పినట్లు వినాలంటూ వేధిస్తుండేవాడు. విసిగిపోయిన ఆమె విషయాన్ని భర్తకు తెలిపింది. దీంతో బాధిత మహిళ కుటుంబికులు టీడీపీ నాయకుడి కోసం గురువారం పగలంతా గాలించారు. రాత్రి కారులో ఇంటికెళ్తుండగా, కదిరి రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద మరో వాహనంలో వెళ్లి అడ్డగించారు. కిందికు లాగి చితకబాదారు. మరో నాయకుడు అడ్డు రావడంతో అక్కడ నుంచి జారుకున్నాడు. బాధితులు మంత్రి సవితకు నేరుగా ఫోన్‌చేసి, ఇలాంటివారు పార్టీలో ఉంటే మీకు, పార్టీకి మంచిదికాదని చెప్పినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో ఆ టీడీపీ నాయకుడి వేధింపుల దారుణాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. దేహశుద్ధి ఘటనపై పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువతి అదృశ్యం

కదిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం యువతి ఇంటిలో ఉన్న చెత్తను బయటకు పడేసి వస్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదన్నారు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హ్యాకథాన్ పోటీల్లో సత్తా

బహుమతులు ప్రదానం చేసిన రిజిస్ట్రార్


జేఎన్‌టీయూ టీమ్‌కు బహుమతిని అందజేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 పోటీల్లో జేఎన్‌టీయూఏ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు పలు కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. తమ ప్రతిభతో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. జేఎన్‌టీయూ అనంతపురం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ పోటీలను గురువారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి వివిధ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన టాప్-2 జట్లు పాల్గొన్నాయి. మొత్తం 19 జట్లు హాజరయ్యాయి. పది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు ప్రారంభించారు. రాత్రి ముగింపు వేడుకల్లో రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటం కంప్యూటింగ్ అనేది కొత్తగా మొదలైన ఒక పరిశోధనా అంశం అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్లకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్లకు రూ.5వేలు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

గెలుపొందిన వారి వివరాలు..

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆచార్య కె. మాధవి రెండు టీమ్‌లు మొదటి స్థానంలో నిలిచాయి. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పల్లవి టీమ్, కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన బుక్కిటి, ప్రణవ్ సాయి టీమ్, కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల చరణ్, గంగాశ్రీ జట్లు, శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రామస్వామి టీమ్, రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బసిద్ టీమ్ మొదటి స్థానంలో నిలిచాయి. అదేవిధంగా శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ రిశిక్ టీమ్, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సనియా టీమ్, కేవీఆర్ మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యు.భారతి టీమ్, కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల హర్షిత టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

ఎస్కేయూ విద్యార్థుల ప్రతిభ

క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025 సెమీస్‌లో విజయం


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్వాంటం వ్యాలీ హ్యాక్‌థాన్-2025లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెమీఫైనల్‌లో రెండు టీమ్‌లు పాల్గొనగా ఇందులో ఒక టీమ్ మొదటి బహుమతి సాధించింది. విద్యార్థులను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సెమీఫైనల్ పోటీల్లో విజయం సాధించడంతోపాటు రూ.10వేలు బహుమతి గెలుచుకోవడం అభినందనీయమన్నారు. వీరు అమరావతిలో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారని తెలిపారు. రెండో టీమ్ బెస్ట్ ప్రెజెంటేషన్‌లో కన్సలోషన్ బహుమతి పొంది రూ.5వేలు అందుకుందన్నారు. రెండు టీమ్‌లలో సఫాన్, ధరణి బెస్ట్ ప్రోగ్రామర్స్‌గా ఎన్నుకోబడ్డారన్నారు. విద్యార్థుల విజయంలో సాంకేతిక సహకారం అందించిన అధ్యాపకులు కుల్ దీప్, నరసింహులు, శారద, రాజేష్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎస్కేయూ ఔన్నత్యం

- ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అనిత పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ శిబిరాల్లో విజేతలైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పలువురు ప్రొఫెసర్లు శుక్రవారం అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాణించడం ప్రశంసనీయమన్నారు. కర్ణాటకలోని మంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐకాన్ అంతర్జాతీయ శిబిరంలో పాల్గొని మూడు ఈవెంట్లలో హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మదీహ విజేతగా నిలిచిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగంలో రాష్ట్ర సమాచార కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో సైతం రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమన్నారు. కర్ణాటకలోని బెళగావిలో రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో వివిధ ఈవెంట్లలో వెంకటసాయి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల), వినూతలక్ష్మి(బాలయేసు డిగ్రీ కళాశాల హిందూపురం), గౌతమిశ్రీ(ఎన్‌వీడిగ్రీ కళాశాల అనంతపురం), దీపిక (కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతపురం), గిరివర్ష(బాలాజీ డిగ్రీ కళాశాల హిందూపురం) రామమూర్తి (కేటీఎస్‌ప్రభుత్వ డిగ్రీకళాశాల రాయదుర్గం), సుబ్రహ్మణ్యం(పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెనుకొండ), గణేష్(ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఫార్మసూటికల్ సైన్స్, ఎస్కేయూ), గదిలింగప్ప(ఎస్కేపీ డిగ్రీ కళాశాల గుంతకల్లు), స్వాతి బాయి(ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందూపురం) విజేతలు నిలవడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ సమైక్యత శిబిరానికి, ఐకాన్ అంతర్జాతీయ సదస్సుకు ఏపీ టీం కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించిన హిందూపురం ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులను ఈసందర్భంగా వీసీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మురళీధర్ రావు పాల్గొన్నారు.

వైసీపీ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి


నివాళులు అర్పిస్తున్న అనంత వెంకటరామి రెడ్డి


తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(ఫైల్)

అనంతపురం కలెక్టరేట్/ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(70) మృతి చెందారు. శుక్రవారం ఆత్మకూరు మండలం తోపుదుర్తిలోని పొలంలో పనులు చేయిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కింద పడిపోయారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. భాస్కర్‌రెడ్డి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌పార్టీలో పనిచేశారు. ఆత్మకూరు మండల ఎంపీపీగా పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి కవిత జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి దంపతులు ఆ పార్టీలో చేరారు. భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని నగరంలోని రామచంద్రనగర్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య, గంగుల భానుమతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌రెడ్డికి కుమార్తె, కుమారుడు సంతానం.

గాయపడిన మహిళ మృతి

తలపై రాడ్డుతో బాదిన భర్త

చికిత్స పొందుతూ మృత్యువాత


మృతురాలు సుమియా, భర్త అల్తాఫ్‌ఖాన్ (ఫైల్)

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భర్త దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు పెనుకొండలోని కుమ్మరదొడ్డిలో నివాసముంటున్న ఇక్బాల్‌సాబ్, పర్వీన్‌ల కుమార్తె సుమియాబేగం(25)ను అదే వీధిలో నివాసముంటున్న అల్తాఫ్‌ఖాన్ ఏడేళ్ల కిందట ప్రేమించి, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఎనిమిది నెలల నుంచి కుటుంబ కలహాలతో దంపతులిద్దరూ విడిగా ఉంటున్నారు. మృతురాలు సుమియాబేగం స్థానిక ఘనగిరి పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 26న పాఠశాలలోనే భార్యతో గొడవపడిన అల్తాఫ్‌ఖాన్ పిల్లలను తన నివాసానికి తీసుకెళ్లాడు. పిల్లలను ఏదైనా చేస్తాడన్న భయంతో సుమియాబేగం అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రం కావడంతో అల్తాఫ్‌ఖాన్ ఇనుపరాడ్డుతో సుమియా తలపై బలంగా మోదాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త అల్తాఫ్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవాటిని వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ ఆదేశించారు. శుక్రవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కార్యాలయంలో ఈఈ శ్రీనివాసులుతో కలిసి జిల్లాలోని డీఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాప్తాడు, శింగనమల డివిజన్‌లలోని పలు మండలాల్లో చోటు చేసుకున్న సమస్యలపై సంబంధిత ఏఈలకు క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. వెంటనే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా స్వచ్ఛభారత్ పనుల్లో భాగంగా చేపడుతున్న మరుగుదొడ్లు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణంతో పాటు వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు శ్రీరాములు, శ్రీధర్, రేహాన వసీం, చంద్రశేఖర్, కిరణ్ తేజ, రాంగోపాల్‌రెడ్డి, ఏఈలు శ్రీనివాసులు, హరికుమార్, శివకుమార్, వరలక్ష్మి, రవీంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మన్న, నాగేంద్ర, జనార్దన్, సుప్రజారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనాభాను అనుసరించి రిజర్వేషన్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సీట్లను కుదించారని అన్నారు. తెలంగాణాలో మాదిరిగా కుల గణన చేపట్టి, జనాభా లెక్కలను అనుసరించి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం కూడా జనగణనతోపాటుగా కుల గణన చేపడతామని ప్రకటించినందున.. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కులగణన చేయాలన్నారు. దీనిపై ఈ నెల 14న విజయవాడలో అఖిలపక్ష పార్టీలు, కుల సంఘాల నేతలతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ హిట్ సదస్సులో బీసీల జపం చేసి, వారి రాజకీయ రిజర్వేషన్లపై ఏమీ చెప్పలేదన్నారు. చంద్రబాబు ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఆలోచనలో ఉన్నారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, బి.మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రన్నింగ్‌లో మార్పు

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20703/04) రైళ్ల రన్నింగ్ నమూనాను మార్చినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు వారానికి ఆరు రోజులు నడుస్తున్నాయి. బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు రాకపోకలు సాగిస్తున్నాయి. డిసెంబరు 4వ తేదీ నుంచి బుధవారానికి బదులు శుక్రవారం తప్ప ఇతర రోజుల్లో ఈ రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు.

16 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 16 మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా గుత్తి మండలంలో 27.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పెద్దవడుగూరు 9.0, పుట్లూరు, నార్పల 6.4, గుంతకల్లు, వజ్రకరూరు 6.2, తాడిపత్రి 4.2, విడపనకల్లు 4.0, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం 3.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 2.4 మి.మీలోపు వర్షం కురిసింది. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. గుంతకల్లులో ఓ మోస్తారు వర్షం పడింది. యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇఫ్‌కో కంపెనీకి చెందిన 1130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ శుక్రవారం పరిశీలించారు. జేసీ ఆదేశాల మేరకు... ఏపీ మార్క్‌ఫెడ్‌కు 580, సొసైటీలకు 220, ప్రైవేటు డీలర్లకు 330 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు.

జాబ్ మేళా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 15మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉపాధి కల్పన జిల్లా అధికారి పల్లవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతపురం ఎంజీ బ్రదర్స్ హెచ్‌పీసీఎల్‌లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి కల్పన కార్యాలయ అధికారులు, ఎంజీ బ్రదర్స్ కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

15 నుంచి విద్యుత్ జేఏసీ ఆందోళనలు


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ దశలవారీ ఆందోళనలకు సిద్ధమైంది. ఈనెల 15నుంచి ఆందోళనలు చేపట్టనున్నారు. ఆ మేరకు జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15, 16 తేదీల్లో ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. 17, 18న అన్ని సర్కిల్ కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట భోజన విరామ సమయంలో ధర్నాలు చేస్తామన్నారు. 19, 20న సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు. 22న జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జి.టి. శ్రీనివాసులు, కో కన్వీనర్ రాఘవేంద్ర హర్ష, వైస్ చైర్మన్ కళ్యాణచక్రవర్తి, నాయకులు నాగార్జున, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా భవానీ రవికుమార్ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న భవానీ రవికుమార్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ శుక్రవారం స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర చైర్మన్ పట్టాభిరామ్, మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన భవానీ రవికుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బాధ్యతలను ప్రణాళిక ప్రకారం నిర్వర్తించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. అనంతరం అనంతపురం నుంచి వెళ్లిన అభిమానులు, జనసేన పార్టీ నాయకులు భవానీ రవికుమార్‌తో కలిపి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్రమిషన్ రాష్ట్ర చైర్మన్ పట్టాభిరామ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పలువురు కూటమి నాయకులు, చిరంజీవి యువత పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలిపారు.

రేగడి కొత్తూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసు

● ఎమ్మెల్యే చొరవతో నెరవేరిన గ్రామస్థుల కల


ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగడికొత్తూరు గ్రామస్థుల కల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చొరవతో సాకారం అయ్యింది. ఎట్టకేలకు ఆ గ్రామానికి శుక్రవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. కొన్నేళ్లుగా ఆ గ్రామానికి బస్సు సౌకర్యం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఎన్నికల ముందు బండారు శ్రావణిశ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు అనంతపురం నుంచి వడియంపేట, పొడరాళ్ల మీదుగా రేగడికొత్తూరుకు ఆర్టీసీ బస్సు వేయించారు. గ్రామానికి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సును నడపనున్నట్లు ఆరీస్టీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ బస్సు గ్రామానికి రావడంతో ప్రజలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి


ధర్నా చేస్తున్న ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు అనేక సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆర్డీటీ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తోందని తెలిపారు. పేదలకు అండగా నిలుస్తున్న ఆ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను నిలుపుదల చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు మద్దులచెరువు మల్లి, కేపీ నారాయణస్వామి, చిన్నపెద్దన్న, కుంటిమద్ది ఓబుళేసు, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణకు బహుజన లాయర్ల జేఏసీ

అనంతపురం వైద్యం: ఆర్డీటీ పరిరక్షణకు బహుజన లాయర్ల ప్రత్యేక జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్లు బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప తెలిపారు. స్థానిక బీఎల్ఎఫ్ కార్యాయలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం సాంకేతిక, న్యాయ, పరిపాలనా అంశాల్లో పోరాటాలు చేయడానికి మేధావి వర్గమైన లాయర్ల ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటుచేస్తామని అన్నారు. 13న బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించే జేఏసీ ఏర్పాటు సమావేశానికి న్యాయవాదులు తరలిరావాలని కోరారు.

ర్యాలీని విజయవంతం చేయండి

రాప్తాడు: ఆర్డీటీని రక్షించుకోవడానికి ఈనెల 15న అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకూ నిర్వహించే ర్యాలీ విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. ఈ మేరకు రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు ధన, శ్రీనివాసులు, నాగేంద్ర, లక్ష్మన్న, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎస్‌డీఓగా మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా అభివృద్ధి ఇన్‌చార్జి అధికారి (డీఎస్‌డీఓ)గా ఎస్ఎం మంజులను నియమించారు. ఇదివరకు శ్రీసత్యసాయి జిల్లా డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ కొనసాగారు. అయితే ఆయన రెండు జిల్లాలకు పనిచేయడం కష్టంగా ఉందని తెలపడంతో శాప్‌లో సీనియర్ అథ్లెటిక్ కోచ్‌గా ఉన్న ఎస్ఎం మంజులను ఇన్‌చార్జిగా నియమిస్తూ శాప్ వైస్‌చైర్మన్, ఎండీ గిరీషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో క్రీడాభివృద్ధికోసం శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, డైరెక్టర్ బొమ్మినేని శివ అభిప్రాయాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వండి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వడ్డే ఓబన్న జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం వారు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ....స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామని, పనులు ప్రారంభించుకోవాలని తెలిపారు. కమిటీ నాయకులు జయరాం, గోపాలకృష్ణ, కుంచపు వెంకటేశులు, గంగన్న, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతిని స్థానిక క్లాక్‌టవర్ కూడలి వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ... దేశంలో సోషలిజం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా సీతారాం ఏచూరి మార్క్సిస్టు భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్, ఆర్వీ నాయుడు, నగర కార్యదర్శివర్గ సభ్యులు ముర్తాజ, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, ఎర్రిస్వామి, రాజు, ఎస్టీఆర్ సీన, పండ్లతోటల రైతుసంఘం నాయకులు శివారెడ్డి, బీహెచ్ రాయుడు, సంజీవరెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

అనంతపురం విద్య, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని పలువురు దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా ట్రైసైకిళ్లు, కృత్రిమకాళ్లు అందజేసింది. స్థానిక జిల్లా దివ్యాంగుల శాఖ కార్యాలయంలో శుక్రవారం వారికి దివ్యాంగులు, వృద్ధపౌరుల సహాయ కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి వాటిని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షమానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ అర్చన, ఇతర ఉద్యోగులు, దివ్యాంగులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కృత్రిమకాళ్లు అందజేస్తున్న దృశ్యం

గూగూడును అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
● గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

నార్పల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రమైన గూగూడును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గూగూడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుతో కలిసి ప్రారంభించారు. అలాగే అందుకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గూగూడు గ్రామాన్ని దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామస్థుల కోరిక మేరకు ఆయన తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ. 15 లక్షల ఎంపీ నిధులతో అత్యాధునిక సాంకేతికతతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. దాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గ్రామంలో ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. త్వరలోనే శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని, అలాగే రూ.5లక్షల ఎంపీ నిధులతో త్వరలోనే బస్‌షెల్టర్ నిర్మిస్తామని, అదేవిధంగా రాజ్యసభ ఎంపీ నిధులతో ముఖ్య అతిథుల కోసం అతిథి గృహం నిర్మాణానికి త్వరలోనే భూమిపూజ చేస్తామని తెలిపారు. గూగూడును అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి తాను, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ శక్తివంచనలేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తర్వాత వారు రూ. 7లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ప్రతాప్‌చౌదరి, మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఇది అందరి విజయం: ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ సక్సెస్ వెనుక పది రోజుల కష్టం ఉందని, ఇది మనందరి విజయమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. కష్ట పడిన కార్యకర్తలు, నాయకులను ఎప్పటికీ మరిచిపోనని అన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో నాయకులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నాయకులు, క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభ విజయవంతం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి, విదేశాల నుంచి కూడా ఫోన్లు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు తమ వంతు పాత్ర పోషించారని కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, నాయకులు సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, సుధాకర్ నాయుడు, రాజారావు, రంగాచారి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో 79 మందికి మంజూరైన రూ.79 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే తన కార్యాలయంలో అందజేశారు. సీఎం చంద్రబాబు సహకారంతో ఇప్పటి వరకూ అర్బన్‌లో సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.60 కోట్లు అందించామని తెలిపారు.


ఆయకట్టుకు 130 రోజులు సాగునీరు ఇవ్వాలి

● ఏపీ రైతుసంఘం డిమాండ్


ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కింద ఉన్న ఆయకట్టుకు 130రోజులు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక హెచ్చెల్సీ ఎస్ఈ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వర్షాలు సకాలంలో రాకపోవడంతో రైతులు 87వేల హెక్టార్లలో పంటలు సాగు చేయకుండా బీళ్లుగా పెట్టారన్నారు. ఈ ఏడాది కర్ణాటక పైభాగంలో కురిసిన వర్షాలకు తుంగభద్ర డ్యాం నిండడంతో జిల్లా రైతుల్లో ఆశలు పెరిగి పంటల సాగు చేసుకోవచ్చని భావించారన్నారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి 24 టీఎంసీల నీటి కేటాయింపులు చేసినట్లు అధికారులు ప్రకటించారన్నారు. సకాలంలో జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం నిర్వహించి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తారని రైతులు ఎదురుచూస్తున్నారని, కానీ ప్రజాప్రతినిధులు, హెచ్చెల్సీ అధికారుల నిర్లక్ష్యంతో తీరని నష్టం జరుగుతోందని అన్నారు. వెంటనే ఐఏబీ సమావేశం నిర్వహించి ఎంపీఆర్ కింద ఉన్న ఆయకట్టు, చెరువులకు, పీఏబీఆర్ కింద ఉన్న చెరువులకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌కి వినతిపత్రం అందజేశారు. పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షులు రాయుడు, రాజారామ్‌రెడ్డి, జిల్లా కమిటీ నాయకులు చెన్నారెడ్డి, వలీ, భాస్కర్‌రెడ్డి, పోతలయ్య, వెంకటకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లోకేష్ యాదవ్


మంత్రి నారా లోకేష్‌తో లోకేష్‌యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లోకేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 13మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లాకు చెందిన కళ్యాణదుర్గం నియోజకవర్గం ఓబుళాపురం గ్రామానికి చెందిన గొల్ల లోకేష్‌యాదవ్‌కు చోటు కల్పించారు. దీంతో ఆయన శుక్రవారం అమరావతిలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను కలిసి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశాల్లో సమస్యలపై చర్చ

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కర్రెన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో సభ్యులు తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులకు వివరించి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడిని నివారించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బాలకృష్ణుడు, వైస్‌ఎంపీపీ సంపత్‌కుమార్, ఎంఈఓ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్‌స్వర్ణలత, ఏపీఓశంకర్, ఏఈఓ షరీఫ్, ఎంపీటీసీ సభ్యు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. పసులూరు, దండువారిపల్లి, ఏడావులపర్తి గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, వెంటనే అక్కడ నీటి ట్యాంకర్లు పెట్టి ప్రజల దాహార్తిని తీర్చాలని విన్నవించారు. వీటితో పాటు గ్రామాల్లో వర్షం వస్తే ... రోడ్లు బురద మయంగా మారుతున్నాయని, సీసీ రోడ్లు వేయాలని కోరారు. ఇక రైతులకు యూరియా కొరత సమస్యను పరిష్కారించాలన్నారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఎంపీపీ సునీత, ఈఓఆర్డీ సదాశివ, ఏఓ శ్యాం సుందర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పలకొండ గ్రామంలో దివ్య అనే మహిళ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. కొప్పలకొండకు చెందిన మధు, దివ్య దంపతులు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే దివ్య శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

నేడు పవర్ కట్

రాప్తాడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ధర్మవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు ఉన్నందున రాప్తాడు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వర కూ విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

కనగానపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు బుధవారం జిల్లా బాలల సంరక్షణ విభాగం పీఓలు నాగలక్ష్మి, ప్రసన్న బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేసుకుంటే కలిగే నష్టాల గురించి వివరించారు. అలాగే బాలల రక్షణ చట్టాలపై, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి, మహిళా పోలీసు వరలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంబరాలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల అంగన్‌వాడీలు సంబరాలు చేసుకున్నారు. చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 27 మినీలను మెయిన్ కేంద్రాలుగా మారాయి. దీంతో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీఓ కవితాదేవి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జిల్లాలో అర్చక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 17న జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో అర్చక సమావేశం నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులంతా ఈ సమావేశానికి హాజరవుతారని, సహాయ కమిషనర్ కూడా హాజరై అర్చక సమస్యలపై స్పందించాలని కోరారు. సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటగిరయ్య, ముచ్చుకోట ప్రసాద్, నవీన్, విజయ్‌కుమార్, ఆరుద్రలేడు తిరుపతయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే పరిటాల సునీత



చెక్కులు పంపిణీ చేస్తున్న బండారు శ్రావణిశ్రీ, ముంటిమడుగు కేశవరెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 41 మందికి రూ.31.39లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్టీఆర్ వైద్యసేవలను మరింత విస్తృతం చేశామన్నారు. అయితే దీనిని ప్రైవేటుపరం చేస్తున్నట్లు వైసీపీ నాయకులు విష ప్రచారం చేయడంపై మండిపడ్డారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత ఎమ్మెల్యే వెంకటాపురంలోని వ్యవసాయ క్షేత్రంలో, కనగానపల్లి మండలం నరసంపల్లి వ్యవసాయ క్షేత్రంలో సాగుచేసిన పంటలనుపరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో సీకేపల్లి మండల కన్వీనర్‌ముత్యాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ అమరేంద్ర, మాజీ కన్వీనర్ శ్రీరాములు, కనగానపల్లి మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సుబ్బరాయుడు, యూత్‌నాయకుడు మురళి పాల్గొన్నారు.

● శింగనమల/గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గంలోని తొమ్మిది మందికి రూ.38.72 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకులో చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనారోగ్యానికి గురై చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసా నిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శింగనమల మార్కెట్‌యార్డు చెర్మన్ దండు శ్రీనివాసులు, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ


ప్రసన్నాయపల్లిలో యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ప్రసన్నాయపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ కృష్ణ చైతన్య తెలిపారు. రైతుల వేలిముద్రలు సేకరించి ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తా పంపిణీ చేశామన్నారు. యూరియాతో పాటు ఇతర ఎరువులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై విద్యుత్ ఎస్ఈకి ఫిర్యాదు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): డబ్బులు తీసుకుని తమ బోరుబావుల సర్వీసులకు డీడీలు కట్టలేదని విద్యుత్ ప్రైవేట్ కాంట్రాక్టర్లపై గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూ రోడ్డులో గల విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 2019లో హెచ్‌వీడీఎస్ స్కీమ్ కింద వ్యవసాయ కనెక్షన్లకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారని, వాటికి 90బోరు బావుల సర్వీసులు ఏర్పాటు చేసి అప్పట్లో లైన్‌మెన్లు సుధీర్, వెంకట సూచనల మేరకు కడపకు చెందిన కాంట్రాక్టర్లు అంజి, విశ్వనాథ్‌యాదవ్ డబ్బులు వసూలు చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ కనెక్షన్లకు నంబర్లు లేవని, ఆ సర్వీసులను పునరుద్ధరించుకోవాలని స్థానిక విద్యుత్ అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో తమకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదన్నారు. ఇప్పుడు సర్వీసుల పునరుద్ధరణకు డబ్బులు కట్టాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సదరు కాంట్రాక్టర్లతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈక్రమంలో ఓ కాంట్రాక్టర్‌తో ఎస్ఈ మాట్లాడారు. గత ఆరు నెలలుగా రైతులు తమ వద్ద తిరుగుతున్నారని, రైతుల వద్ద డబ్బులు తీసుకుని సర్వీసులకు డీడీలు ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే పోలీసు కేసు పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నారాయణ స్కూల్లో విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్వారకా నగర్ నారాయణ స్కూల్లో శుక్రవారం దంతవైద్య శిబిరం నిర్వహించారు. దంతవైద్యురాలు అనూషనాయక్ తమసిబ్బందితో కలిసి విద్యార్థులకు దంతపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం దంతాలు పరిశుభ్రత ఎంతప్రాముఖ్యమో పిల్లలకు వివరించారు. ప్రిన్సిపాల్ ఆస్మాఖాన్, టీచర్లు పాల్గొన్నారు.

నందివిగ్రహం చోరీ ఘటనను నిగ్గుతేల్చాలి

● పోలీస్‌స్టేషన్ ఎదుట ముష్టికోవెల గ్రామస్థుల నిరసన


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయంలో నంది విగ్రహం చోరీ సంఘటన తమనెంతో బాధపెట్టిందని, ఈ ఘటనను వెంటనే నిగ్గు తేల్చాలంటూ మండలంలోని ముష్టికోవెల గ్రామ ప్రజలు శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ముష్టికోవెల గ్రామ శివారులో ఉన్న శివాలయంలో ఈనెల 4వతేదీన నంది విగ్రహం చోరీకి గురైన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్థులు 5వతేదీన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే సంఘటన జరిగి వారం రోజులు దాటినా నందివిగ్రహం ఆచూకీ తెలియకపోవడంతో గ్రామస్థులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కేసు పురోగతి, నందివిగ్రహం ఆచూకీ గురించి తెలపాలని పోలీసులను అడిగారు. అయితే ఎస్ఐ పుట్టపర్తికి వెళ్లారని, వచ్చిన తరువాత రావాలని సిబ్బంది తెలపగా వారు ఆగ్రహించారు. తమకు నందివిగ్రహం ఆచూకీతో పాటు కేసు వివరాలు తెలిపే వరకు ఇక్కడినుండి వెళ్లేదిలేదంటూ స్టేషన్‌ఎదుట బైఠాయించి శివుని భక్తిగీతాలు ఆలపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారికి వీహెచ్‌పీ, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు మద్దతు పలికి మాట్లాడారు. దాదాపు 500 ఏళ్ల కాలం నాటి పురాతన ఆలయమని, అక్కడ ప్రజలకు శివుడు ఆరాధ్యదైవమని, అలాంటి ఆలయంలో నందివిగ్రహం అపహరణకు గురికావడం ఆ గ్రామస్థుల మనోభావాలను దెబ్బ తీసిందని తెలిపారు. రోజులు గడుస్తున్నా చోరీకి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. దీంతో ఈ సమస్యను సిబ్బంది ఫోన్‌ద్వారా ఎస్ఐ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆయా గ్రామస్థులతో పాటు వీహెచ్ పీ, భజరంగదళ, ఆర్ఎస్ఎస్ నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై కేసు నమోదు చేశామని, ఇప్పటికే అనుమానం ఉన్నవారిని కూడా విచారించామని తెలిపారు. గణేశ్ నిమజ్జనం, సీఎం సభ బందోబస్తు కారణంగా బిజీగా ఉన్నామని, ఇప్పటి నుంచి ప్రత్యేక దృష్టిసారించి దర్యాప్తును వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు నిరసనను విరమించారు.

న్యూస్ బాక్స్

పంటలకు వర్షం దెబ్బ



నీట మునిగిన ఆముదం పంట

బొమ్మనహాళ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలో గురువారం కురిసిన వర్షానికి వరి, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు రామంజనేయులుకు చెందిన నాలుగు ఎకరాల్లో ఆముదం, నాలుగు ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. నీరు ఎక్కువగా ఆముదం పంటలో నిలువ ఉండడం వల్ల చెట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆముదం కరువును తట్టుకునే పంట అని సాగు చేస్తే ఒక వర్షం వల్ల దెబ్బతిందని వాపోయాడు. పంట నష్టం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దీనిపై ఏఓ సాయికుమార్‌ను వివరణ కోరగా.. పస్తుతం వరిలో నీరు నిలువ ఉన్న పెద్దగా ప్రమాదం ఉండబోదని, కాని ఆముదం, పత్తి, మొక్కజొన్న పంటలో నీరు నిల్వ ఉండకుండా బయటకు మళ్లించాలని సూచించారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను పరిశీలిస్తున్న దాతలు

కుందుర్పి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలకు దాతలు రూ. 60 వేల విలువైన ఐదు కంప్యూటర్లను శుక్రవారం అందజేశారు. దీంతో ఆ దాతలను మండల విద్యాధికారి శంకరన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు వారిని అభినందించారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుమ్మగట్ట మండలంలోని అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు అందించి .. పక్కా ఇళ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారయణ స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గుమ్మగట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్యకర్తలతో కలిసి ఆందోళన చేపట్టిన ఆయన మాట్లాడారు. హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. తహసీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ.. అర్హులైనవారందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి , సంజీవప్ప, నాగార్జున, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

వంతెన ప్రారంభం



వంతెనపై వెళ్తున్న బస్సు

బెళుగుప్ప, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి క్రాస్ వద్ద హగరి నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించారు. గతంలో వంతెన 2022 సెప్టెంబరు 9వ కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో గుండ్లపల్లి కూడలిలోని అనేక మంది చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. హోటళ్లు, పూలు, పండ్లు, టీ కొట్లు మూతపడ్డాయి. పయ్యావుల కేశవ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ వంతెనను నిర్మించేందుకు రూ. 13 కోట్లు మంజూరు చేయించారు. వంతెన నిర్మాణం పూర్తి కావడంతో శుక్రవారం నుంచి దానిపై వాహనాల రాకపోకలను ప్రారంభించారు.

జీరో ఎఫెక్ట్ సర్టిఫికేషన్‌పై అవగాహన

యాడికి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో జీరో ఎఫెక్ట్- జీరో డిఫెక్ట్ సర్టిఫికేషన్‌పై వ్యాపారులకు ఎంఎస్ఈ (బెంగళూరు)కో-ఆర్డినేటర్ గణేష్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రతి పరిశ్రమలు, దుకాణాలు జీరో ఎఫెక్ట్ - జీరో డిఫెక్ట్ సర్టిఫికేషన్ తీసుకోవాలని, దాని ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఈ సదస్సులో విశాలాక్షి ఖాదీసేవా సంస్థ అధ్యక్షుడు నారాయణ స్వామి, విజన్ హైస్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రహదారి

గుత్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గురువారం కురిసిన వర్షానికి గుంతకల్లు రోడ్డు పూర్తిగా ధ్వసమైంది. దీంతో గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి 63వ జాతీయ రహదారి వరకు ఉన్న తారురోడ్డు పూర్తిగా దెబ్బతిని.. గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేషనల్ హైవే, అర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును బాగా చేసేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

రాయదుర్గం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.30 లక్షలతో చేపట్టిన తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులను విప్ కాల వ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. కణేకల్లు ట్యాంక్ నుంచి పట్టణానికి నీటి సరఫరా చేస్తున్న పైప్‌లైన్ మరమ్మతులకు మరో రూ. 40 లక్షలు మంజూరైందన్నారు. ఆ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, పద్మజ, టంకశాల హనుమంతు, పొరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, బండి భారతి, వేణు, వై వెంకటేశులు, రావుత్ రాజశేఖర, ఎల్లప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న విప్ కాలవ

ముగ్గురి విధులు ఒక్కరికే..!

- ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటీ ఎంపీడీఓ
- గాడి తప్పిన పాలన

యాడికి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): స్థానిక డిప్యూటీ ఎంపీడీఓ శశికళ .. ఇన్‌చార్జి ఎంపీడీఓగా, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తోంది. ఒక్కరే ముగ్గురి విధులను నిర్వహించాల్సి రావడంతో ఆమెపై అదనపు భారం పడుతోంది. ఒక్కరే అన్ని విధులను చూసుకోలేకపోవడంతో పాలన గాడి తప్పుతోంది.

● యాడికి గ్రామపంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు పామిడికి మూడు నెలల క్రితం బదిలీ అయ్యారు. ఇంతవరకూ కార్యదర్శిని నియమించలేదు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓ శశికళకు ఆ బాధ్యతలు అప్పగించారు.

● యాడికి ఎంపీడీఓ వీరరాజు నెల రోజులపాటు శిక్షణకు శ్రీకాళహస్తికి వెళ్లారు. ఆయన బాధ్యతలనూ డిప్యూటీ ఎంపీడీఓకు అప్పగించారు.

దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ శశికళ మాట్లాడుతూ.. ఇన్‌చార్జి ఎంపీడీఓగా, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించాలంటే చాలా కష్టంగా ఉందని, అదనంగా మరో ఇద్దరి విధులు నిర్వహిస్తుండటంతో పాలన కుంటుపడుతోందని అన్నారు.



యాడికి ఎంపీడీఓ కార్యాలయం, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ (ఇన్‌సెట్లో)

జీఎస్టీ తగ్గింపుపై హర్షం



మోదీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తాడిపత్రి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను 5 శాతం, 8 శాతం తగ్గించడంపై స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ అంకాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో నరేంద్రమోదీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రజక సెల్ డైరెక్టర్ రామాంజనేయులు, శింగరి లక్ష్మినారాయణ, గంగాధర్ యాదవ్, శేషఫణి, కంబగిరి, నారాయణస్వామి పాల్గొన్నారు.

కాలువలో పశువు కళేబరాన్ని తొలగించండి



కాలువలో కుళ్లిపోయిన పశువు కళేబరం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని దేవగిరి క్రాస్ సమీపంలో 1వ డిస్ట్రిబ్యూటరీ కాలవలో వారం రోజులుగా పడి ఉన్న గేదె కళేబరాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. వారం క్రితమే ఆ కళేబరాన్ని తొలగించాలని అధికారులు, లస్కర్లను కోరినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. చాలా మంది వ్యవసాయ కూలీలు ఈ కాలవలోని నీటినే తాగుతుంటారని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 156 పథకాలకు హామీలు ఇచ్చి కేవలం ఐదు పథకాలు గురించే మాట్లాడుతోందని విమర్శించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సంజీవప్ప, తాలూకా కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ పాల్గొన్నారు.

సామాజిక ప్రజా వేదిక

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 19వ సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదిక కార్యక్రమాన్ని డ్వామా ప్రెసిడెంట్ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1260 పనులకుగాను రూ. 14.40 కోట్లు ఖర్చు చేశారు. ఆ పనులను సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పీ నీలకంఠ ఆధ్వర్యంలో రెండో తేదీ నుంచి 11వ తేదీ వరకు పరిశీలించి ఈ ప్రజావేదికలో వెల్లడించారు. రూ. 47,680 రికవరీకి ఆదేశించారు. మండలంలో 19 పంచాయతీల్లో నిర్వహించిన పనులపై నేమ్ బోర్డు పెట్టకపోవడం, కొలతల్లో హెచ్చుతగ్గులు, హార్టికల్చర్‌లో మొక్కలు తక్కువగా ఉండటం గుర్తించి రూ. 92,800 అపరాధం విధించినట్లు తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌ను పునరుద్ధరించండి

కణేకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పునరుద్ధరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు మెరిమెట్ల ఎల్లన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మూతపడ్డ ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు అకులప్ప, రామాంజినేయులు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ

తాడిపత్రి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): స్థానిక విజయనగర్‌కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం టాలెంట్ టెస్ట్‌బుక్‌లను శుక్రవారం పంపిణీచేశారు. రోటరీక్లబ్ సభ్యుడు కుమ్మెత ప్రవీణ్ సహకారంతో దాదాపు రూ.10వేలు విలువజేసే పుస్తకాలను 20మంది విద్యార్థులకు అందజేశారు.

రామిరెడ్డి కాలనీలో రోడ్లు వేయాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక రామిరెడ్డి కాలనీలో రోడ్లను వేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ కోరారు. స్థానిక ఆ కాలనీలో శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఆ కాలనీ ప్రజలకు కనీస మౌలికసౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఆ పార్టీ డివిజన్ సభ్యులు జిలాన్, సత్తార్, రామదాస్, నారాయణ, బాష ఉన్నారు.

వంతెన నిర్మించండి



రోడ్డుపై గుంతలో నిల్వ ఉన్న వర్షపు నీరు

ఉరవకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఉరవకొండ- చాబాల రహదారిలోని హంద్రీనీవా కాలువపై వంతెన నిర్మించాలని టీడీపీ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శి గౌస్ సాహెబ్‌కు వినతి పత్రాన్ని అందజేసిన వారు మాట్లాడారు. ఇటీవల రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయన్నారు. వర్షం పడినప్పుడు రోడ్డు బురదమయం కావడంతో పాటు గుంతలు ఉండటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పక్కనే కాలువ ఉండటంతో పెను ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్గం నుంచి పొలికి, చాబాల, ధర్మపురి, జనార్ధనపల్లి గ్రామాలకు వెళ్లాల్సి ఉందని, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు ఈ మార్గం నుంచే వెళ్తుంటాయని మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి వాపోయారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగమ్మ



నాగమ్మను సన్మానిస్తున్న చైర్మన్, మంత్రి

తాడిపత్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన టంగుటూరి నాగమ్మకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారని ఆమె కుమారుడు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు సింహం జగన్నాథరెడ్డి శుక్రవారం తెలిపారు. విజయవాడలో నాగమ్మ పురపాలక మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, సీఈఓ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారన్నారు. తమ కుటుంబ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీకి సేవలు అందిస్తోందని, దీంతో తండ్రి సింహం నారాయణరెడ్డికి మార్కెట్ యార్డు చైర్మన్, రెండుసార్లు సర్పంచు, మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ మెంబర్.. ఇలా అనేక పదవులను పార్టీ ఇచ్చిందన్నారు. పార్టీని నమ్ముకొని ఉన్నవారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని అనడానికి తమ కుటుంబమే నిదర్శనమన్నారు. ఈ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



శుభాకాంక్షలు తెలుపుతున్న మండల టీడీపీ నాయకులు

పుట్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన సుదర్శన్‌నాయుడిని కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. సుదర్శన్‌నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రవీంద్రచౌదరి, భాస్కర్‌నాయుడు, లక్ష్మయ్య, ఆదినారాయణరెడ్డి, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, వెంకటరమణ, పెద్దయ్య, రామాంజి పాల్గొన్నారు.

● యల్లనూరు : రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గరికపాటి సుదర్శన్‌నాయుడిని పుట్లూరులోని ఆయన నివాసం వద్ద మండల నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన్ను క్లస్టర్ ఇన్‌చార్జి చల్లా చంద్రశేఖర్‌నాయుడు, టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



సుదర్శన్‌నాయుడిని సన్మానిస్తున్న యల్లనూరు మండల నాయకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజోతి): మండలంలోని ఉడేగోళం విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ బాలచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆవులదట్ల, పల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

● తాడిపత్రి : పట్టణ సమీపంలోని తేరన్నపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఏ ప్రభాకర్ రావు తెలిపారు. తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లో, యాడికి మండలంలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

శ్మశాన వాటికను బృందావన గార్డెన్‌గా మారుద్దాం

తాడిపత్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికను బృందావనం గార్డెన్‌గా మారుద్దామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్మశానవాటికను ఆయన రాజమండ్రికి చెందిన నర్సరీ యజమానులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి నివాళి

తాడిపత్రి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి ఉన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

తాడిపత్రి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డు, జింకావారివీధి, వడ్లపాలెం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను పరిష్కరించాలని కొందరు ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎర్రగుడిలో పారిశుధ్య పనులు

బెళుగుప్ప, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే మండలంలోని ఎర్రగుడి బీసీ, ఎస్సీ కాలనీల్లోని గుంతల్లో నీరు నిలబడి.. దోమలు అధికమయ్యేవి. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడేవారు. దీంతో స్థానికులు టీడీపీ నాయకులు స్పందించి.. ఆ కాలనీల్లో పారిశుధ్య పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కాలనీలోని గుంతలను పూడ్చివేయించామని టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

రేపటి నుంచి ఉరుసు

పామిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హజరత్ సయ్యద్ ఖాదర్ వలి బాబా మదని ఉరుసును ఆది, సోమ, మంగళవారాల్లో నిర్వహిస్తున్నట్లు రహమతుల్లా అలయ్ దర్గా షరీఫ్ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ వేడుకలు నిర్వహిస్తామన్నారు.



క్రైం న్యూస్ ..

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీకాలనీ వాసి లక్ష్మన్న (43) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను గుజరి వ్యాపారి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను .. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాపులో ఉంది.

దుకాణంలో చోరీ

ఉరవకొండ,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గవిమఠం ఆవరణంలో ఉన్న కేజీఎన్ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆ దుకాణ యజమాని గురువారం రాత్రి షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు. దుండగులు ఆ దుకాణ తాళాలు పగలగొట్టి.. మోటార్లు, బేరింగ్‌లు, వ్యవసాయ పరికరాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ1.50 లక్షలు ఉంటుందని బాధితుడు జిలాన్ తెలిపారు.

టీడీపీ నాయకుల ఘర్షణ

గుత్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకుల మధ్య తలెత్తిన వివాదం.. ఘర్షణకు దారి తీసి.. పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం చేరింది. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభకు పట్టణంలోని 24వ వార్డు నుంచి ప్రజలను ఎందుకు తక్కువగా తరలించారని పట్టణ పార్టీ కన్వీనర్ ఎంకే చౌదరి ... శ్రీనాథ్ అనే వ్యక్తిని శుక్రవారం ఫోన్ చేసి ప్రశ్నించాడు. ఈ విషయమై 24వ వార్డుకు చెందిన రైల్వే కానిస్టేబుల్ వాసు .. పట్టణ కన్వీనర్‌తో దురుసుగా మాట్లాడారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణంలో ఇరువర్గాల వారు వాదనకు దిగారు. తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, అతని వల్ల తనకు, తన కుటుంబానికి హాని ఉందని రైల్వే కానిస్టేబుల్ వాసుపై పట్టణ కన్వీనర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వాసుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పామిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ షర్మిలకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

● కుందుర్పి : ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మంజునాథ్, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ బీసీ తిమ్మప్ప, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

● బెళుగుప్ప : తమ డిమాండ్లు నెరవేర్చాలని ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

● ఉరవకొండ : ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు.

● గుత్తి : సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



అవినీతిపై విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ

యాడికి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గుంతకల్లు డీఎల్‌పీఓ విజయలక్ష్మి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ గ్రామపంచాయతీలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిధుల దుర్వినియోగమయ్యాయని సీపీఎం నాయకులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టారు. బిల్లులు, ఎం- బుక్కులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నివేదిక తయారుచేయడానికి మూడురోజులు పడుతుందని, ఆ సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. విచారణలో డిప్యూటీ ఎంపీడీఓలు దామోదర్‌రెడ్డి, శశికళ, సర్పంచు అనురాధ, గతంలో పనిచేసిన పంచాయతీ సెక్రటరీ అశ్వర్థమనాయుడు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన విద్యుత్ స్తంభం

ఉరవకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి భజన మందిరం సమీపంలో ఇంటిపైన ఓ విద్యుత్ స్తంభం కూలింది. భారీగా శబ్దం రావడంతో ఆ ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి.. మరమ్మతులు చేపట్టారు. స్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతోనే కూలిందని స్థానికులు తెలిపారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటి పై కూలిన విద్యుత్ స్తంభం

ఏపీటీఎఫ్ మండల శాఖ ఏకగ్రీవం

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో ఎన్నికల అధికారి, జిల్లా అధ్యక్షులు జీ వెంకటేశులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా కణం రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తుమటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

పామిడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసుభే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి దేవాలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి తిరుపతినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకన్న సేవలో ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఆయన కుమారుడు ఈశ్వర్, సోదరుడు శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

